క్లుప్తంగా

లిఫ్టర్ రేవతికి ఎమ్మెల్యే అభినందన



తెనాలి: రాష్ట్రస్థాయి సీనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బ్రెంచిప్రెస్ చాంపియన్‌షిప్–2023లో 63 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించిన తెనాలి యువతి వక్కలగడ్డ రేవతిని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన 10వ సీనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బ్రెంచిప్రెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు జరిగాయి. పోటీల్లో పతకం పొందిన రేవతిని బుధవారం సాయంత్రం సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్ భవిష్యత్‌లో ఆమె మరిన్ని విజయాలు సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు.

మైసమ్మ తల్లికి వెండి కిరీటం



ఖాజీపేట(తెనాలి): ఖాజీపేటలోని శ్రీలక్ష్మీమైసమ్మ అమ్మవారికి కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ధూళిపాళ శ్రీనివాసరావు–గాయత్రీదేవి దంపతులు వెండికిరీటం బహూకరించారు. 1.250 కిలోల వెండికిరీటం, కళ్లు, రాళ్లబొట్టును అందజేశారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, మేళతాళాలు, భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించినట్టు బుధవారం తెలిపారు. ఆలయ నిర్వాహకులు బోడె సురేష్ బబు–లీలావతి దంపతులు పర్యవేక్షించారు.

క్షయవ్యాధిపై అవగాహన సదస్సు



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం, పెదరావూరు గ్రామాల్లో హెల్త్ మేళాలో భాగంగా తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జీవనలత సూచనల మేరకు హెల్త్ వెలెనెస్ సెంటర్లలో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంతెవరంలో సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పెదరావూరులో సర్పంచ్ కాకి రమాదేవి రోగులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమాల్లో టీబీ యూనిట్ ఇన్‌చార్జి రవికుమార్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందుల సీజ్



తెనాలిటౌన్: పట్టణ మారీసుపేట గుర్రాల సందులోని నీలిశెట్టి నరసింహారావు ఎరువుల షాపులో అనధికారికంగా బిల్లులు లేకుండా విక్రయిస్తున్న పురుగు మందులను వ్యవసాయశాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయని ఎనిమిది రకాల అనధికార పురుగు మందులను గుర్తించి సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులకు బిల్లులు ఇవ్వకుండా పురుగు మందులు విక్రయించినట్లు గుర్తించామని వెల్లడించారు. రూ.1,50,070 విలువైన పురుగు మందులను సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఏడీఏ కె.వెంకట్రావు, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్‌లో తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి చీర బహూకరణ



రేపల్లె రూరల్: పేటేరు గ్రామదేవత శ్రీ మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారికి ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కందుల సాంబశివరావు కుటుంబ సభ్యులు అందించిన రూ.3 లక్షల విలువైన వెండి చీరను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు ముందుకు వస్తే ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు అల్లం శెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌ఛార్జ్ కనపర్తి రవికిరణ్, మునుసోబు పరుచూరి శ్యాంప్రసాద్, నాయకులు రావు సూరిబాబు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- నాలుగో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభం



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: నవరత్న పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. నాలుగో వార్డు బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్ వద్ద నుంచి బుధవారం సాయంత్రం శివకుమార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాలుగో వార్డు ఇన్‌చార్జి షేక్ నాగూర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అడుసుమల్లి శ్రీనివాసరావు సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. తమ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు.

రూ.30 కోట్ల మేర సంక్షేమం

నాలుగో వార్డు పట్టణంలోని పెద్ద వార్డులలో ఒకటి అని, రెండు సచివాలయాలు ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. రెండు సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు రూ.30 కోట్ల మేర సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. ఏడాదికి రూ.10 కోట్ల చొప్పున వార్డు ప్రజలకు లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. రూ.మూడు కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. నాలుగో వార్డులో రెండు సచివాలయాల పరిధిలో 1,693 గృహాలు ఉన్నాయని, 5,470 మంది జనాభా ఉన్నారని వెల్లడించారు. వైఎస్సార్ చేయూత ద్వారా 200 మందికి, వైఎస్సార్ ఆసరా ద్వారా 250 మందికి, వైఎస్సార్ సున్నావడ్డీ ద్వారా 650 మందికి ప్రయోజనం కలిగినట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, రాష్ట్ర కృష్ణబలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, మాజీ వైస్‌చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, అత్తోట నాగవేణి, అన్నాబత్తుని పద్మజ, తోట రఘురామ్, గడవర్తి సాయిహరేరామ్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, మార్కెట్ యార్డు డైరెక్టర్ తులసీ భగవాన్, నాల్గావ వార్డు నాయకులు దేసు శ్రీనివాసరావు, రెడ్డి రమణమ్మ, రిమ్మనపూడి నరసింహారావు, దేవరపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ సుభానీ, షేక్ జిలానీ, ఎం.కృష్ణ, పి.కోటేశ్వరరావు, పండు, వల్లెం కోటేశ్వరరావు, నక్కా సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, పచ్చవ రమేష్, మేకల రవి, కాకిదేవ సహాయం, కాళిదాసు వెంకటసత్యం, తాడిబోయిన పోలురాజు, అక్కిదాసు కిరణ్‌కుమార్, బూరెల దుర్గా, కుర్రా శ్రీను, కాలేషావలి, షేక్ గఫూర్, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, కాళిదాసు వెంకటేశ్వరరావు, టిక్సే బాల, చుండూరు సాయి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు నాలుగో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలిఅర్బన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నాలుగో వార్డు బీసీ కాలనీలోని పెట్రోల్ బంక్ దగ్గర నుంచి గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

మోదీ పాలనలో పెరిగిన ధరలు

తెనాలి: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటంతో సామాన్యులు బతకలేని పరిస్థితి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాలను బుధవారం తేలప్రోలు, కఠెవరం, కంచర్లపాలెం గ్రామాల్లో సాంబిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, కంచర్ల తారకేశ్వరరావు పాల్గొన్నారు.

భర్తపై దాడి కేసులో భార్యకు జరిమానా

తెనాలిరూరల్: భర్తపై దాడి కేసులో భార్యకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ప్రాస్యూక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో పట్టణానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి వెంకట్రావుపై అతడి భార్య వరలక్ష్మి 2020 జూన్‌లో ఇనుపరాడ్డుతో దాడి చేసి గాయపరిచింది. దీనికి ఆమె పిల్లలు సహకరించారు. తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు బుధవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా వరలక్ష్మికి రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పిల్లలపై కేసు కొట్టి వేశారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

వైభవంగా ధార్మిక పూజా మహోత్సవాలు

కొల్లూరు: ధార్మిక పూజా కార్యక్రమాలను మండలంలోని ఈపూరులంకలో ఘనంగా నిర్వహిస్తున్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో చేపట్టిన పూజా కార్యక్రమాలలో భాగంగా స్థానిక శ్రీరామాలయంలో భజన సంకీర్తనలు ఆలపించారు. హిందూ ధర్మ ప్రచారక్ సభ్యులు ఈ సందర్భంగా భక్తులకు రామాయణం, భగవద్గీతల గురించి వివరించారు. పూజా కార్యక్రమాలలో భాగంగా పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గోవింద నామాలతో సంకీర్తనలతో రామాలయానికి చేరుకుని భజన సంకీర్తనలు నిర్వహించారు.

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు

రేపల్లె: మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలే జరుగుతాయని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజ ఏర్పాటు అంశంపై పట్టణంలోని ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థలైన ఆర్‌సీ కళాశాల ఆవరణంలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలైన గంజాయి, ఖైనీ, గుట్కా, విమల్ వంటి వాటిని తీసుకోవటం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులబారిన పడతారని హెచ్చరించారు. నరాల బలహీనత, మానసిక ఒత్తిళ్లకు గురయ్యేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. నోరు, గొంతు, జీర్ణాశయం, ఊపిరితిత్తులు వంటి అవయవాలు పూర్తిగా దెబ్బతింటాయని చెప్పారు. విద్యార్థులు తమ భవిష్యత్‌కు బంగారు బాటలు పడలంటే ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటుపడి అనేక మంది తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్న విషయం తెలిసి ఉండాలన్నారు. కేవలం విద్య, ఆటలపైనే తమ దృష్టిని కేంద్రీకరించాలని చెప్పారు. తమ తోటి వారు ఎవరైనా ఇటువంటి వ్యసనాల బారినపడితే వారు సత్ప్రవర్తనతో నడిచేలా తీర్చిదిద్దాలన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిఅర్బన్: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు కేంద్రాలకు చేరుకున్నారు. హాల్ టికెట్ నెంబర్ల ఆధారంగా కేటాయించిన గదులలో వారు కూర్చుని పరీక్షలు రాశారు. తెనాలి పట్టణంలో 11 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల, జేఎంజే మహిళా కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల, వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల, నాజరుపేటలోని శ్రీవివేకానంద మహిళా జూనియర్ కళాశాల, గాంధీనగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాల, టుటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, గంగానమ్మపేటలోని నారాయణ జూనియర్ కళాశాల, గంగానమ్మపేటలోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సెకండ్ ల్యాంగ్వేజ్ పరీక్ష జరిగింది. తహసీల్దార్ రవిబాబు పట్టణంలోని పలు సెంటర్లను తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించాయి. బుధవారం పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు.

పీహెచ్‌సీలో అభివృద్ధి సలహా సంఘ సమావేశం



సలహా సంఘ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర(తెనాలిటౌన్): పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి కోరారు. మండలంలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అభివృద్ధి సలహా సంఘ సమావేశం ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ పీహెచ్‌సీ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. అనంతరం మందులు, పరికరాలు, పరీక్ష యంత్రాలను ఎంపీపీ పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఉన్న వసతుల గురించి మెడికల్ ఆఫీసర్ చిక్కాల లక్ష్మీసుధ వివరించారు. వైద్యశాలలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో కృషి చేస్తామని ఎంపీపీ పద్మావతి తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, సర్పంచ్ వేమూరి దీనమ్మ, ఉపసర్పంచ్ ఆళ్ళ నాగిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మా సుజాత, మాజీ ఎంపీటీసీ సభ్యులు భీమవరపు సంజీవరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ జాకీర్‌హుస్సేన్, సీహెచ్‌వో డి.స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పిహెచ్ఎన్ కోటేశ్వరి, హెచ్‌వి డి.ఆశీర్వాదమ్మ, ఆలీఖాన్,షేక్ మస్తాన్‌బీ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన రంగస్థల కళలపై సదస్సు



కళారూపాన్ని ప్రదర్శించిన కళాకారులు

తెనాలి: స్థానిక చెంచుపేటలోని ఎన్‌సీకేఎస్ కల్యాణ మండపంలో బుధవారం భారతదేశపు ప్రాచీన రంగస్థల కళలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా నవ చైతన్య కళామండలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పీఠాధిపతి దొప్పలపూడి శాలం రాజు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గురించి వివరించారు. విశిష్టమైన సాంస్కృతిక సమగ్రత కలిగిన మన వారసత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ పీటర్ థామస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాచీన, ఆధునిక కళలు, నృత్యాలు, ఆచార వ్యవహారాలు, ప్రదర్శనలు, చారిత్రక కట్టడాలు, పురాతత్వ ప్రదేశాల గురించి వివరించారు. సదస్సులో సాంస్కృతిక నిపుణులు, నృత్యకళాకారులు పాల్గొనగా, రిసోర్స్ పర్సన్లు ప్రధాన జానపద కళలు, నృత్యరూపాలు, దృశ్య కళలను ప్రదర్శించారు. డి.ప్రవీణ్‌పాల్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, డి.శిరీష, జ్యోతిర్మయి, మేరీ, భూపతి, భూమిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు

తెనాలిటౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు పెయింటింగ్‌లో ఇస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 42మంది ఆర్యవైశ్య మహిళలకు సర్టిఫికెట్లను సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం ప్రదానం చేశారు. పెయింటింగ్ శిక్షకురాలు వాణిశ్రీని సత్కరించారు. ఆర్యవైశ్య మహిళ సంఘ అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి పర్యవేక్షణలో 30రోజుల పాటు శిక్షణ జరిగిందని వివరించారు. రాబోయే రోజుల్లో ఎంబ్రాయిడరీ, గొలుసులు, మగ్గం వర్క్స్, గ్లాస్ పెయింటింగ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన ఆర్యవైశ్య మహిళలందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధ్యక్షుడు శ్రీనివాసరావు సూచించారు.

ఈ–క్రాప్‌లో తప్పులుంటే సరిచేసుకోండి

ఏవో బాలాజీ గంగాధర్



ఈ–క్రాప్ వివరాలను రైతులకు వివరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

చెరుకుపల్లి: మండలంలో రబీ సాగులో ఉన్న 15,971 ఎకరాలకు ఈ–క్రాప్ నమోదు చేయటం జరిగిందని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీ గంగాధర్ పేర్కొన్నారు. మండలంలోని రాంబొట్లపాలెం గ్రామంలోని ఆర్బీకే కేంద్రం వద్ద గ్రామ సభను బుధవారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించటం జరిగిందని, ఏమైనా తప్పులు, మార్పులు చేర్పులు ఉంటే వెంటనే అభ్యంతరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద లిఖిత పూర్వకంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి.విజయానంద్ వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.సురేష్, వేదికపై ఎఫ్‌డీఓలు

బాపట్ల అర్బన్: మండలంలోని సూర్యలంక తుఫాను షెల్టర్ వద్ద చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.సురేష్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ, గ్రీన్ క్లయిమేట్ ఫండ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గ్రీన్ క్లయిమేట్ ఫండ్ వారి నిధులతో తీర ప్రాంతంలోని మత్స్యకారులకు పర్యావరణ సంసిద్ధతను పెంపొందించేందుకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన ద్వారా జీవనోపాధిని పెంపొందించడానికి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. శిక్షణలో భాగంగా చేపలు, రొయ్యల నుంచి వివిధ రకాల విలువ ఆధారిత ఉత్పత్తులైన చేప, రొయ్య పచ్చళ్లు, చేప బాల్స్, చేప కట్‌లెట్స్, చేప చట్నీ పొడి, రొయ్య శాండ్‌విచ్, చేప పరోటా, రొయ్య స్వీట్ కార్న్ సమోసా వంటి తదితర విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చీరాల అసిస్టెంట్ డైరెక్టర్ బి.కృష్ణ కిషోర్, నిజాంపట్నం ఎఫ్‌డీఓ సాయి సందీప్, కూచిపూడి ఎఫ్‌డీఓ మహిజ, బాపట్ల ఎఫ్‌డీఓ రవీంద్ర, గ్రామ మత్స్య సహాయకులు, శిక్షణ కార్యక్రమంలో స్వయం సహాయక మహిళలు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

హే భగవానా

- వర్షం హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- భారీవానలు కురిస్తే రబీ పంటలకు చేటు



కొల్లిపరలో కండె వేసిన మొక్కజొన్న

తెనాలి: రాయలసీమతోపాటు కోస్తాంధ్రలో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే ఆస్కారం ఉందంటూ వాతావరణశాఖ చేసిన ముందస్తు హెచ్చరికలు జిల్లా రైతాంగం గుండెల్లో తుఫాన్ రేపుతున్నాయి. రబీ పంటలు కీలకమైన దశలో ఉన్న తరుణంలో వర్షాలు కురిస్తే పంటల పరిస్థితి ఏమిటనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మాగాణి భూముల్లో వేసిన జొన్న, మొక్కజొన్న, పెసర, శనగ, మినుము పంటలు సాగు చేసిన రైతుల బెంగ అంతా ఇంతా కాదు.

జొన్న, మొక్కజొన్నతో కనీస ఆదాయం

జీరో టిల్లేజ్ విధానం డెల్టాలో ఆరంభించిన నాటి నుంచి జిల్లాలో రబీలో మొక్కజొన్న సాగు తప్పనిసరైంది. ఖర్చులు భరించలేని రైతులు జొన్నకేసి మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి పంట ఆదాయానికి, ఖర్చులకు సరిపోతుండటంతో రైతులు, కౌలు రైతులు నాలుగు డబ్బులు రబీలో సాగుచేస్తున్న మొక్కజొన్న, జొన్న పంటలతోనే కళ్లచూస్తున్నారు. ఎకరాకు 35–40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండటం, కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావటం, మార్కెట్‌లో క్వింటాలుకు ధర రూ.2 వేలకు పైగా ఉండటంతో రైతులకు ఖర్చులు పోను ఎకరాకు రూ.30 వేల వరకు మిగులుతోంది. జిల్లాలో విస్తారంగా సాగుచేసే జొన్న పైరుకు కనీస ఆదాయం రూ.25 వేల వరకు ఉంటోంది. దీంతో మాగాణి భూముల్లో రబీలో జొన్న, మొక్కజొన్న సాగు విస్తారమైంది. గుంటూరు జిల్లాలో ఈ రబీలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 53 వేల ఎకరాలు కాగా, ప్రస్తుతం 63,386 ఎకరాల్లో వేశారు. అత్యధిక విస్తీర్ణం తెనాలి డివిజన్ లోనే ఉందనే విషయం తెలిసిందే.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొక్కజొన్న విస్తీర్ణం 1.60 లక్షల ఎకరాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం 1.60 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పైరు ఉంది. అలాగే 29,405 ఎకరాల్లో జొన్న సాగుచేశారు. పెసర 24,463, మినుము 9,452, శనగ 16,175 ఎకరాల్లో సాగులో ఉన్నాయి.

గాలివాన కురిస్తే నష్టమే! : ప్రస్తుతం మొక్కజొన్న ముదురు చేలల్లో కంకి వేసింది. ఈనెల 25వ తేదీ తర్వాత నుంచి కండె విరిచే అవకాశముంది. లేత చేలు మరో 15 రోజుల్లో కోతకు వస్తాయి, సాధారణ వర్షానికైతే ముదురు మొక్కజొన్న చేలకు పెద్దగా ప్రమాదం ఉండకపోవచ్చు. గాలులతో కూడిన భారీ వర్షం సంభవిస్తే మొక్కజొన్న పంట నేలవాలుతుంది. అదే జరిగితే నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇక జొన్న పైరుకు కంకి మొక్కకు పైభాగంలో ఉంటుంది. వర్షానికి కంకులు పూర్తిగా తడిచే ప్రమాదముంది. అదే జరిగితే గింజలు రాలతాయి. కంకులు రంగు మారిపోతాయి. ఫలితంగా దిగుబడి తగ్గటమే కాకుండా, నాణ్యత పడిపోతుంది. రైతులకు నష్టం అనివార్యమవుతుంది. జొన్నతోపాటు పెసర, మినుము, శనగ పంటలకు కూడా వర్షాలు చేటు తెస్తాయనటంలో సందేహం లేదు. భారీ వర్షాలు రాకుండా ఉండాలని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు.

వర్షాలు అంతగా ఉండకపోవచ్చు

తేలికపాటి వర్షాలు కురిస్తే రబీ పంటలకు పెద్దగా ప్రమాదం ఉండదు. గాలులతో ఎడాపెడా వర్షం వస్తే జొన్న, మొక్కజొన్న పంటలు పడిపోయి నష్టం కలుగుతుంది. వర్షాలు అంత ఉధృతంగా ఉండకపోవచ్చని భావిస్తున్నాం.

– నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి